
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 16 అక్టోబరు 2023
5
ఏలూరు



అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


ఏసుబాబు (ఫైల్)

భీమడోలు : అప్పులబాధ తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఆర్థావారిగూడెంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పేరం ఏసుబాబు(40) భీమడోలులో ఉంటూ వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో సుమారు రూ.16 లక్షల మేర అప్పులపాలయ్యాడు. ఇంటిపై కూడా అప్పు తీసుకుని మూడు నెలలుగా నెలసరి వాయిదాలు చెల్లించడం లేదు. దీంతో ఇల్లు వేలం వేస్తామని నోటీసు పంపారు. ఇప్పటికే పలువురి దగ్గర తీసుకున్న వ్యక్తిగత అప్పులు కూడా తీర్చలేకపోవడంతో, అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురై తన ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అతని బంధువులకు అప్పగించారు.



వినియోగదారులకు షాకిస్తున్న విద్యుత్ బిల్లులు
అదనపు ఛార్జీల పేరిట బాదుడే బాదుడు
భారాలకు సామాన్య ప్రజలు గగ్గోలు
రూ.700 బిల్లు వస్తే సగం అదనపు ఛార్జీలే
ఉచితాల కింద రూపాయి ఇచ్చి రూ.పది దోపిడీ అంటూ జనాల్లో చర్చ

ఈ నెల మూడో తేదీన తీసిన కరెంటు బిల్లులో అదనపు భారాలు ఇలా..

వాడుకున్న కరెంటుకు వచ్చిన బిల్లు రూ.394.50
- ఫిక్స్‌డ్ ఛార్జీ - రూ.20
- కస్టమర్ ఛార్జీ - రూ.45
- ఇడి ఛార్జీ - రూ.7.20
- సర్‌ఛార్జీలు - రూ.25
- ఇడిఇంటెట్ - రూ.0.07
- ట్రూ అప్ ఛార్జీ - రూ.68
- ఎఫ్‌పిపిసిఎ ఛార్జీ - రూ.127
- ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జీ - రూ.49
- లాస్‌గెయిన్ ఛార్జీ - రూ.0.23
- మొత్తం బిల్లు - రూ. 736

వాడుకున్న కరెంటు బిల్లు రూ.394.50. అదనపు ఛార్జీల వడ్డన రూ.342

సర్దు 'పోటు'..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కరెంటు బిల్లుల మోతతో సామాన్య ప్రజలు విలవిల్లాడుతున్నారు. అడ్డూఅదుపూ లేని ఈ బాదుడు ఏమిటంటూ ప్రభుత్వంపై తీవ్ర అగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బిల్లులో సగం అదనపుఛార్జీల భారమే ఉండటంతో జనం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో ప్రతినెలా బిల్లులు కట్టలేక సామాన్య ప్రజానీకం గగ్గోలు పెడుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 12 లక్షల గృహవిద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అత్యధిక కనెక్షన్లు సామాన్య ప్రజానీకానివే. విద్యుత్ ఛార్జీల పెంపుతో పాటు, అదనపు ఛార్జీల భారం వినియోగదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కరోనా తర్వాత సామాన్య ప్రజానీకం ఆదాయాలు భారీగా తగ్గిపోయాయి. పెట్రోల్, డీజిల్ పెరుగుదల, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోవడంతో సామాన్య ప్రజానీకం జీవనం కష్టంగా మారింది. ముఖ్యంగా పట్టణాల్లో పనిచేసే చిరుద్యోగులు, హమాలీలు, చిరువ్యాపారుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. చిరుద్యోగులకు రూ.పది నుంచి రూ.15వేలలోపే జీతాలొస్తున్నాయి. ఈ జీతంతో ఇంటి అద్దె, పిల్లల చదువులు, ఆసుపత్రి ఖర్చులు వంటివి నెట్టుకు రావడమే గగనంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో రూ.400 కరెంటు బిల్లుకు మరో రూ.400 అదనపు ఛార్జీలు వేయడంతో మోయలేని భారంగా మారింది. ఫిక్స్‌డ్ ఛార్జీలు, కష్టమర్, ఇడి, సర్‌ఛార్జీలతోపాటు, ట్రూ అప్ ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు భారీగా వేస్తున్నారు.

అక్టోబర్ నెల మొదటివారంలో తీసిన కరెంటు బిల్లు రూ.736 రాగా, అందులో ఫిక్స్‌డ్ ఛార్జీ రూ.20, కష్టమర్ ఛార్జీ 45, ఇడి ఛార్జీ రూ.7.20, సర్‌ఛార్జీ రూ.25, ట్రూఅప్ ఛార్జీ 68, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీ 127, ఎఫ్‌పిపిసిఎ-2 ఛార్జీకింద రూ.49 మొత్తం రూ.342 అదనపు ఛార్జీల భారం పడింది. అంటే బిల్లులో సగం అదనపుఛార్జీలే ఉన్నాయి. గడిచిన కొన్నినెలలుగా ఇదేవిధంగా విద్యుత్ బిల్లులు వస్తుండటంతో జనం గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే పెరిగిన ధరలతో సామాన్య ప్రజానీకం ఉక్కిరిబిక్కిరి అవుతుండగా కరెంటు బిల్లుల మోత జనాన్ని కోలుకోలేనివిధంగా దెబ్బతీస్తోంది. ఇటీవల కాలంలో ఎలక్ట్రానిక్స్ వస్తువుల వాడకం భారీగా పెరిగింది. ఫ్రిజ్, కూలర్, మిక్సీ, గ్రైండర్, ఐరన్ బాక్స్ వాడకాలు పెరగడంతో పెరిగిన ఛార్జీలతో బిల్లు తడిసిమోపుడువుతోంది. మళ్లీ అదనంగా ఛార్జీల భారం వేయడంతో సామాన్యులు సైతం ప్రతినెలా రూ.వెయ్యికిపైగా బిల్లు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. కరెంటు బిల్లు భారం మోయలేక సకాలంలో కరెంట్ బిల్లులు కట్టలేకపోతున్నారు. సకాలంలో బిల్లులు కట్టలేని వినియోగదారులపై ఫైన్‌ల భారం పడుతోంది. ఒక్కరోజు ఆలస్యమైన బిల్లుకు రూ.వంద ఫైన్ చెల్లించాల్సి వస్తోంది. బిల్లులు సకాలంలో కట్టకపోతే విద్యుత్ అధికారులు ఫీజులు పీకేస్తూ జనాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సంక్షేమం పేరుతో రూపాయి ఇచ్చి ప్రభుత్వం రూ.పది లాగేస్తుందంటూ జనంలో తీవ్ర చర్చనడుస్తోంది. విద్యుత్ భారాలను నిరసిస్తూ ఇప్పటికే సిపిఎంతోపాటు, వామపక్షాలు నిరసనలు కొనసాగిస్తున్నాయి. ప్రజలు సైతం రోడ్డెక్కితే తప్ప ప్రభుత్వాలు దిగొచ్చే పరిస్థితి



విధించిన ఛార్జీలివే..

కనిపించడం లేదు. విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీల పెంపు వంటివి జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల్లో ఉచితాలు ప్రకటించడం, గెలిచిన తర్వాత ప్రజలపై భారాలు మోపుతూ ప్రభుత్వాలు సామాన్యుల జీవితాలతో వికటాట్టహాసం చేస్తున్నాయి.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఎస్‌పి మేరీ ప్రశాంతి

నేటి నుంచి ఇవిఎంల తనిఖీ

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఎస్‌పి మేరీ ప్రశాంతి
తొలి దశలో ఇవిఎంలు, వివిప్యాట్‌లు చెకింగ్
వచ్చేనెల పదో తేదీ వరకూ పరిశీలన
ఎన్నికల నిబంధనల పాటించాలని రాజకీయ పార్టీల నేతలకు కలెక్టర్ విజ్ఞప్తి
ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకూ నిర్వహణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాకు వచ్చిన ఓటింగ్ యంత్రాల పనితీరును పరిశీలించేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి 20 రోజుల పాటు నిరంతరాయంగా నిర్వహించే తొలిదశ తనిఖీ (ఎఫ్ఎల్‌సి) ప్రక్రియను చేపట్టేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. ఆదివారం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఇవిఎం గొడౌన్‌లో ఈనెల 16వ తేదీ నుంచి చేపట్టనున్న ఇవిఎంలు, వివిప్యాట్స్ ఫస్ట్ లెవిల్ చెకింగ్ ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీనుంచి వచ్చేనెల పదో తేదీ వరకూ ఓటింగ్ యంత్రాల పనితీరు పరిశీలించేందుకు ఫస్ట్ లెవిల్ చెకింగ్‌ను పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లతో నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఎఫ్ఎల్‌సి పరిశీలనకు డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజును పర్యవేక్షకులుగా నియమించామన్నారు. ఓటింగ్ యంత్రాల పరిశీలన ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకూ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నియమనిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని బెల్ కంపెనీ ఇంజినీర్లు, జాతీయ రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎఫ్ఎల్‌సి పరిశీలన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణపై ఇప్పటికే జిల్లాలోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమాచారం ఇచ్చామన్నారు. ఈ పరిశీలనకు వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు గుర్తింపు కార్డుతో ఇవిఎంలు భద్రపరిచిన గిడ్డంగికి హాజరు కావాల్సి ఉంటుందన్నారు. జిల్లాకు బ్యాలెట్ యూనిట్లు 5560, కంట్రోల్ యూనిట్లు 4340, వివిప్యాట్లు 5210, కేటాయించగా వీటికి తొలిదశ పరిశీలన జరుగుతుందన్నారు. జిల్లాలోని రెవెన్యూ, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో పాటు ఎంపిడిఒ కార్యాలయ సిబ్బందికి కూడా విధులు కేటాయించినట్లు వెల్లడించారు. ఇవిఎం గొడౌన్‌లోకి ఎవ్వరూ కూడా మొబైల్ ఫోన్లు, డిజిటల్ చేతి గడియారాలు, ఇయర్ ప్యాడ్స్ వంటివి అనుమతించబడవని స్పష్టంచేశారు. కలెక్టర్‌తోపాటు డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, డిఎస్‌పి కృష్ణంరాజు, కలెక్టరేట్ పరిపాలనాధికారి బి.రమాదేవి, డిఐఒ నాగేశ్వరరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్నదొర ఉన్నారు.

19న పండ్ల తోటల రైతుల రాష్ట్ర సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈనెల 19న అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరుగుతున్న పండ్ల తోటల రైతుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక అన్నే భవనంలో అయన మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షలు ఎకరాల్లో మామిడి, అరటి, బత్తాయి, నిమ్మ, బొప్పాయి, జామ, సపోటా, డ్రాగన్, ఖర్జూర, కర్బూజ, దానిమ్మ, పుచ్చకాయ వంటి అనేక రకాల పండ్ల తోటలను రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా అంతు చిక్కని వైరస్‌లతో పండ్ల తోటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండ్ల తోటల రైతులకు పంటల బీమా పథకం అమలు కావడం లేదన్నారు. మరోవైపు మార్కెట్ సౌకర్యం లేక గిట్టుబాటు ధర రాక నిల్వ చేసుకునే అవకాశం లేక పండిన పంటలు దెబ్బతిని నష్టపోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లా పరిధిలో మామిడి, నిమ్మ వేలాది ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారని, కనీస ధర రాక తోటలు తొలగించుకోవాల్సి వస్తోందని చెప్పారు. పండ్ల తోటల రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించి అమలు చేయాలని కోరారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందించాలన్నారు. పంటల బీమా వర్తింప చేయాలని కోరారు. రైతులకు లబ్ధి చేకూరేలా సహకార రంగంలో ప్రోసెసింగ్ యూనిట్స్ నెలకొల్పాలని కోరారు. రాష్ట్ర సదస్సులో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ప్రభుత్వాలు స్పందించి పండ్ల తోటల రైతులను ఆదుకోవాలని కోరారు.


వాటర్‌ట్యాంకు వద్ద స్థానికుల అవస్థలు

జంగారెడ్డిగూడెంలో తాగునీటి అవస్థలు

జంగారెడ్డిగూడెం :స్థానిక 27వ వార్డు శ్రీనివాసపురం రోడ్డులో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఇటీవల తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న అంతరాయం వల్ల ఈ ప్రాంత వాసులకు తాగునీటి ఎద్దడి ఏర్పడింది. కూలీనాలి చేసుకునే పేదలు సంచార జీవితం గడిపేవారు ఈ ప్రాంతంలో మున్సిపాలిటీ ద్వారా సరఫరా చేసే తాగునీటిపైనే ఆధారపడుతున్నారు. ఉదయం సాయంత్రం సమయంలో కుళాయి ద్వారా వచ్చే నీటి కోసం ఎదురుచూస్తున్న పేదలకు సకాలంలో కుళాయి నీరు రాకపోవడం వల్ల ఉపాధి కోల్పోతున్నామని పలువురు వాపోతున్నారు. తాగునీటి సమస్యతో ఎదురవుతున్న ఈ ప్రాంతానికి మున్సిపల్ అధికారులు ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా ఏర్పాటు చేశారన్నారు. దీంతో స్థానికులు గుంపులు గుంపులుగా ఎగబడటం అక్కడి తాగునీటి అవస్థలకు అద్దం పడుతుంది. 27వ వార్డు శ్రీనివాసపురం రోడ్డులో తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి పనులు ప్రారంభించండి

వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు

ఏలూరు టౌన్ :రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితుల దృష్ట్యా తక్షణమే ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీన అనంతపురంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులను, పేదలను, రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సదస్సుకు పార్లమెంట్ సిపిఐ ఫ్లోర్ లీడర్ బినయ్ విశ్వం ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారని వెంకటేశ్వరరావు తెలిపారు. సదస్సులో ఉపన్యాసకులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు పాల్గొంటున్నారని తెలిపారు. సదస్సుకు రాయలసీమ జిల్లాల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రకాశం నెల్లూరు జిల్లాలు కోస్తా జిల్లాల నుండి గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీలు, రైతులు పెద్ద సంఖ్యలో తెలిపారు.

చేప ధర పతనంపై రైతులు ఆందోళన చెందొద్దు : వాసుబాబు

సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ
ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలి : రైతులు
నారాయణపురంలో ఆక్వా రైతుల జిల్లా సమావేశం

ప్రజాశక్తి - ఉంగుటూరు

రూప్‌చంద్ చేపల సాగు ఒడిదుడుకులను ఎదుర్కొంటోందని, సమస్యను సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు మేలు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఎంఎల్ఎ, ఆక్వా రైతుల అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పుప్పాల వాసుబాబు అన్నారు. రూప్‌చంద్ చేప ధర పడిపోయిన నేపథ్యంలో కార్యాచరణ కోసం ఆక్వా రైతుల జిల్లా బహిరంగ సమావేశం ఆదివారం రాత్రి ఉంగుటూరు మండలం నారాయణపురంలో నిర్వహించారు. పొత్తూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ సభకు ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కోవిడ్ సమయంలో రొయ్యకు గిట్టుబాటు ధర కల్పించినట్లుగా రూప్‌చంద్ చేపకు కూడా గిట్టుబాటు ధర కల్పించేలా సిఎం, కమిషన్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ముఖ్యమైన పది మంది రైతులు తనతో వస్తే అమరావతి తీసుకెళ్లి సిఎంతో మాట్లాడిస్తానని వాసుబాబు హామీ ఇచ్చారు. ఆక్వా జోన్ రైతులకు ముఖ్యమంత్రి ఇప్పటి వరకూ రూ.1800 కోట్లు సబ్సిడీలు ఇచ్చారని తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని తెలిపారు. ఫీడ్... సీడ్... సబ్సిడీలపై ప్రభుత్వ నియంత్రణ ఉండేలా అప్సరా చట్టాన్ని అమలు చేసేలా ప్రయత్నిస్తామన్నారు. ఆక్వా జోన్ రైతులందరికీ ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. చేప ధర తగ్గడం వెనుక అనేక కారణాలపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలపై చర్చించాల్సి ఉందన్నారు. ఆక్వా రైతు దుబాయ్ రాము మాట్లాడుతూ రైతులంతా సంఘటితంగా ఉండి నవంబరు నెలాఖరు వరకూ రూప్ చంద్ అమ్మకుండా ఉంటే ట్రేడర్స్ మన దగ్గరకే వస్తే మంచి ధర వస్తుందన్నారు. దీనికి భిన్నంగా రైతులు తొందర పడి ట్రేడర్స్ తీసుకొచ్చే ఒత్తిడితో తక్కువ రేటుకు అమ్మి మీరు నష్టపోవడమే కాకుండా పక్క రైతుకు నష్టం కలిగించొద్దని హితవు పలికారు. నిడమర్రు, మల్లవరం, గణపవరం రైతులు మాట్లాడుతూ చాలా మంది ఐదు ఎకరాల్లోపే చేపల సాగు చేసే రైతులంతా అప్పుల ఊబిలో కూరుకుపోయామని ఈ దశలో ప్రభుత్వం చొరవ తీసుకోకపోతే 300 మందికిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, చెరకు తదితర పంటలకు కనీస మద్దతు ధర ఉన్నట్టే చేపలకు కూడా మద్దతు ధరలను ప్రభుత్వం ప్రకటించాలని సమావేశం తీర్మానించింది. చెరువులో రూప్‌చంద్‌తో పాటు తెల్ల చేపలు పెంచుతున్నామని పట్టుబడిలో రూప్‌చంద్ ధర పతనంతో పాటు తెల్లచేప ధరను సైతం ట్రేడర్స్ తగ్గించి కొంటున్నారని దీన్ని నియంత్రణ చేసే బాధ్యత అసోసియేషన్ తీసుకోవాలని కోరారు. చేపలు కొనే ట్రేడర్స్ పట్టుబడిని ఒకే రోజులో పూర్తి చేయాలని రెండు, మూడు రోజుల పట్టుబడి పట్టి కిలో రూ.80 ఇచ్చినా రైతుకు నష్టమే తప్ప లాభం ఉండదన్నారు. ఫిష్ ఆంధ్రా స్కీమ్‌ను అమలు చేస్తే కొంతవరకు ఉపయోగంగా ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. వందలాది మంది రైతులు పాల్గొన్నారు.


హాజరైన ఆక్వా రైతులు


మాట్లాడుతున్న ఎంఎల్ఎ వాసుబాబు


ఎస్ఐ అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

ప్రశాంతంగా ముగిసిన ఎస్ఐ అభ్యర్థుల రాతపరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రెండు రోజుల పాటు జరిగిన ఎస్ఐ అభ్యర్థుల రాత పరీక్షలు ప్రశాంతంగా సాగాయని ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ తెలిపారు. ఏలూరు రేంజ్ పరిధిలో ఉన్న ఎస్ఐ అభ్యర్థులకు ఏలూరు నగరంలోని ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల 14వ తేదీన ప్రారంభమైన పరీక్షలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఏలూరు రేంజ్ పరిధిలో పరీక్షలకు మొత్తం 4162 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరిలో మొదటి రోజు ఉదయం పరీక్షకు 52 మంది, మధ్యాహ్నం పరీక్షకు 53 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. రెండో రోజు 55 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల ప్రక్రియను అశోక్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయని అభ్యర్థుల సౌకర్యార్థం ఏలూరు నగరంలోని రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లలో ప్రత్యేకంగా హెల్ప్ లైన్ ఏర్పాటు చేశామన్నారు. బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి, కృష్ణా జిల్లా ఎస్‌పి జాషువ, కోనసీమ జిల్లా ఎస్‌పి శ్రీధర్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాత పరీక్షకు హాజరైన అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి వారి బయోమెట్రిక్ ఆధారంగానే వారికి పరీక్ష హాల్లోకి అనుమతించామని తెలిపారు. జిల్లా అదనపు ఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు, డిటిసి డిఎస్‌పి కె.ప్రభాకర్‌రావు, డిఎస్‌పి గోగుల వెంకటేశ్వరరావు, ఏలూరు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రాజశేఖర్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజీ, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, బి.ఆదిప్రసాద్ బందోబస్తు బందోబస్తు నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి మౌలిక సదుపాయాలే కీలకం

ప్రజాశక్తి - ఉంగుటూరు


ఉప్పాకపాడులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

పల్లెల అభివృద్ధికి పట్టుకొమ్మలు మౌలిక సదుపాయాలే అని, అందు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. మండలంలోని ఉప్పాకపాడు, బొమ్మిడి, కాగుపాడు, రావులపర్రు గ్రామాల్లో రూ.2.25 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఆయన ఆదివారం ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఉప్పాకపాడులో రూ.43 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.23 లక్షలతో రైతు భరోసా కేంద్రం, జలజీవన్ మిషన్ నిధులు రూ.30లతో తాగునీటి పైపు మార్గం, ఫిల్టర్‌లను ఆయన ప్రారంభించారు. సర్పంచి నేదూరి వీర వెంకట మోహన్‌రావు, స్థానిక వైసిపా నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఉప్పాకపాడులో రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి సత్వరమే పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయడం సంతోషంగా ఉందన్నారు. బొమ్మిడిలో రూ.43 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో సర్పంచి మద్దాల పెద్దింట్లు, వైసిపి నాయకులు మద్దాల త్రిమూర్తులు, వైస్ ఎంపిపి మేడవరపు విద్యాలక్ష్మి పాల్గొన్నారు. కాగుపాడులో రూ.43 లక్షల వ్యయంతో గ్రామ సచివాలయం భవనాన్ని గ్రామ సర్పంచి కడియాల సుదేష్ణలతో కలిసి ప్రారంభించారు. స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రావులపర్రులో రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని సర్పంచి పైడి వెంకట రమణతో కలిసి ఎంఎల్ఎ వాసుబాబు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు, వైసిపి జిల్లా కార్యదర్శి పుప్పాల గోపీ, మండల సచివాలయ కార్యదర్శి, ఉంగుటూరు ఎంపిటిసి సభ్యులు పెనుగొండ బాలకృష్ణ, వైసిపి నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, నామినేటెడ్ ప్రతినిధులు, ఎంపిటిసి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'రెవెన్యూ డిపార్ట్‌మెంట్ పేరు మార్పు సరికాదు'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో ఉన్న రెవెన్యూ డిపార్ట్‌మెంట్ పేరును భూసాధారణ పరిపాలనగా మార్చాలని ఇటీవల చీఫ్ సెక్రటరీతో జరిగిన సమావేశంలో ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వరరావు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు గ్రామరెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బ్రిటిష్ కాలం నుండి రెవెన్యూ డిపార్ట్‌మెంట్ అంటే అతి పెద్ద డిపార్ట్‌మెంట్‌గా మంచి పేరుందని, రెవెన్యూ అంటేనే చాలామంది గౌరవిస్తారని, అలాంటి డిపార్ట్‌మెంట్‌ను కేవలం పన్నుల వసూలు చేయడానికి మాత్రమే ఉన్నట్లు బొప్పరాజు మాట్లాడడం దారుణమని పేర్కొన్నారు. ఈ రాష్ట్రంలో ఎలాంటి పనులైనా చేయగల శక్తి ఒక రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు మాత్రమే ఉందని, ఇటీవల కాలంలో రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో కొన్ని మార్పులు వస్తాయని చెప్పడంతో ప్రభుత్వం రెవెన్యూ డిపార్ట్‌మెంట్ పేరు మారుస్తుందని ఊహించుకుని, అది ఆయన చెబితేనే ప్రభుత్వం మార్చిందని ఏదో గొప్ప చెప్పుకోవడానికి ముందుగానే చీఫ్‌సెక్రటరీ తో రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌ను భూసాధారణ పరిపాలనగా మార్చాలని బొప్పరాజు చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే రెవెన్యూలో పనిచేస్తూ అనేకమంది తీవ్ర పనిఒత్తిడితో ఇబ్బందులకు గురవుతున్నారని, నేడు పేరు మార్చి ఇంకా పనిఒత్తిడి పెంచాలని చూస్తున్నారా? అని వారు ప్రశ్నించారు. ఉద్యోగులకు రావాల్సిన అనేక రకాల ఆర్థికపరమైన బకాయిలు సెప్టెంబర్‌లో చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పి ఇప్పటివరకూ చెల్లించని నేపథ్యంలో ఉద్యోగులకు కావాల్సిన ప్రయోజనాల గురించి మాట్లాడకుండా రెవెన్యూ శాఖ పేరును మార్చమని అడగటం ఎంతవరకు సమంజసమన్నారు.

సిపిఎస్ విషయంలో ఎంతోమంది ఉద్యోగులు ఇబ్బందులు పడుతూ ఒపిఎస్ కావాలని కోరులుంటే వాటి గురించి మాట్లాడడానికి నోరు రావడం లేదా అని ప్రశ్నించారు. రెవెన్యూలో అటెండర్ దగ్గర నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకూ ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్‌లో ఉన్నట్టు చెప్పుకుంటున్నారని, కానీ ఎపిఆర్ఎస్ఎ రాష్ట్ర కమిటీలో విఆర్ఎలకుగానీ, విఆర్ఒలకు గానీ, సర్వే డిపార్ట్‌మెంట్ వారికి గాని, ఎస్ఒలకు గానీ స్థానం కల్పించారా అని ప్రశ్నించారు. కేవలం రెవెన్యూ ఆస్తులను అడ్డుపెట్టుకుని ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వాలకు భజన చేస్తూ, ఉద్యోగులకు న్యాయం చేయకుండా చలామణి అవుతున్న బొప్పరాజు వంటి నాయకులపై సామాన్య ఉద్యోగులకు కూడా నమ్మకం లేదని విమర్శించారు.

చింతలపూడిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి – చింతలపూడి

మెట్టప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించటం అభినందనీయమని టిడిపి నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. పట్టణంలో శ్రీ పాలశాల ప్రాంగణంలో జీవితర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడ మణిపాల్ హాస్పిటల్ వారితో డాక్టర్ గుత్తా లోకేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని అధిక సంఖ్యలో ప్రజలు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని ఆలోచించి ఉచిత వైద్య సేవలు, మందులు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తా వెంకటేశ్వరరావు, మాటూరి వెంకటరామయ్య, రాజా పాల్గొన్నారు.

'ఉపాధి హామీ చట్టం'పై 18న రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి – చాట్రాయి

ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం ఈ నెల 18వ తేదీన ఏలూరులోని ఆర్ఆర్.పేటలో శ్రీ కాశీ విశ్వేశ్వర కళ్యాణమండపంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కొమ్ము ఆనందం తెలిపారు. ఈ సదస్సులో ఉపాధి హామీ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సహాయ కార్యదర్శి డాక్టర్ పి.శివదాసన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.వెంకటేశ్వర్లు, దడాల సుబ్బారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీవరత్నం, పి.రామకృష్ణ పాల్గొంటారని తెలిపారు. చాట్రాయి మండలంలోని ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

యువతకు వాలీబాల్ కిట్లు

ప్రజాశక్తి – పోలవరం

మండలంలోని పునరావాస కాలనీ వాడపల్లి గ్రామంలో యువతకు బొరగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వాలీబాల్ కిట్లు అందించారు. బొరగం ఫౌండేషన్ సిఇఒ, బొరగం దుర్గాప్రసాద్ దొర ఈ కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో సున్నం రాజేష్, కడపల అబ్బులరెడ్డి, బి.శ్రీనివాస్, కె.రాజు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్ అభివృద్ధికి సహకారం : ఎంఎల్ఎ ఎలిజా

ప్రజాశక్తి – జంగారెడ్డిగూడెం

పట్టణంలో ఆఫీసర్స్ క్లబ్ అసోసియేషన్ అభివృద్ధికి సహకారం అందిస్తానని ఎంఎల్ఎ ఎలిజా హామీ ఇచ్చారు. స్థానిక ఎస్ఎస్ నగర్‌లో ఉన్న ఆఫీసర్స్ క్లబ్ భవన ప్రాంగణాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆఫీసర్లందరూ ఐక్యంగా ప్రజలకు అందుబాటులో ఉండడం ఆదర్శనీయమన్నారు. ఆఫీసర్స్ క్లబ్ అవసరాలకు తనను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ పి.బుజ్జిబాబు, వైసిపి నాయకులు బత్తిన చిన్న పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

వివాహేతర సంబంధం మానుకోమన్నందుకు..

కన్నతల్లి, చెల్లిపై కత్తిపీటతో దాడి

ప్రజాశక్తి – జీలుగుమిల్లి

వివాహేతర సంబంధం మానుకొమని మందలించినందుకు కన్న తల్లిపై, తోడబుట్టిన చెల్లిపై కత్తిపీటతో కిరాతకంగా దాడి చేసిన ఘటన ఆదివారం తెల్లవారజామున మండలంలోని తాటియాకులగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వి.చంద్రశేఖర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కవులూరి కాంతారావు, బేబి దంపతులకు ముగ్గురు సంతానం. కాంతారావు అశ్వారావుపేటలోని ఓ కర్మాగారంలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వారి కుమారుడు వంశీకృష్ణ డిగ్రీ చదివి అనంతరం చదువు మానేసి కూలి పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో చెప్పిన మాట వినకుండా అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. విషయం తల్లికి తెలియడంతో అతడిని మందలిస్తుండగా వారి మధ్య ప్రతిసారి గొడవ జరుగుతుంది. ఈ క్రమంలో వంశీకృష్ణ ఆదివారం తెల్లవారుజామున ఇంటికి రాగా తల్లి మళ్లీ గట్టిగా మందలించడంతో కోపోద్రిక్తుడైన వంశీకృష్ణ, అతని అనుచరులతో కలిసి ఇంట్లో ఉన్న కత్తి పీటతో తల్లిపై పక్కనే ఉన్న చెల్లిపై కూడా దాడి చేయడంతో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు గమనించి వారిని అడ్డుకుని వెంటనే 108లో జంగారెడ్డిగూడెంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని చెల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి – ముదినేపల్లి

చేపలు పట్టుబడికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని వి.రావిగుంట గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం ములపర్రు గ్రామానికి చెందిన పి.నాగరాజు(50) ఆదివారం ఉదయం తన తోటి కూలీలతో కలిసి చేపల పట్టుబడి నిమిత్తం మండలంలోని వి.రావిగుంట వెళ్లాడు. ఈ క్రమంలో చెరువులో వల లాగుతుండగా చెరువులో నీరు బయటకు పోయేందుకు అమర్చిన తూము నాగరాజును వెనక్కి లాగి వేయడంతో చెరువులో పడి మునిగిపోయాడు. గమనించిన తోటి కూలీలు నాగరాజును బయటికి తీసి చికిత్స నిమిత్తం బంటుమిల్లి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో నాగరాజు మరణించాడు. నాగరాజు అకాల మరణంతో ములపర్రులో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పొక్లెయిన్ దహనం

ప్రజాశక్తి – నూజివీడు రూరల్

మండలంలోని దేవరగుంట గ్రామంలో మడిచర్ల గ్రామానికి వెళ్లే రహదారి సమీపంలో వైసిపి నేత అచ్చి కాసులకు చెందిన పొక్లెయిన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున నిప్పంటించారు. ఈ ప్రమాదంలో పొక్లెయిన్ దహనమైంది. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి – చాట్రాయి

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... మండలంలోని ఆరుగొలనుపేట గ్రామానికి చెందిన తిరివీధి శ్రీనివాసరావు భార్య పుట్టింటికి వెళ్లిపోయిందనే మనస్తాపంతో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం

అధ్వానంగా ముదినేపల్లి సెంటర్
రోడ్డుపైనే మురుగునీరు
భయాందోళనలో వాహనదారులు


ముదినేపల్లి సెంటర్‌లో అధ్వానంగా రోడ్డు


దుకాణాల ఎదుట మురుగునీరు

ప్రజాశక్తి – ముదినేపల్లి

కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి, అధికారుల అలసత్వం తోడు కావడంతో జాతీయ రహదారి గోతులమయమై అధ్వానంగా మారింది. దీంతో ఇటు ప్రజలు, అటు వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎప్పుడు ఏప్రమాదం చోటు చేసుకుందోనని వాహనదారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి నిలువెత్తు నిదర్శనమే ముదినేపల్లి ప్రధాన సెంటర్.

పామర్రు–దిగమర్రు 165 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ముదినేపల్లి సెంటర్‌లో విస్తరణ పనులు జరుగుతున్నాయి. పామర్రు నుంచి ఆకివీడు వరకు విస్తరింప చేసేవిధంగా గుత్తేదారుడు కాంట్రాక్టు కుదుర్చుకున్నాడు. ఈ రహదారి విస్తరణతో ముదినేపల్లి మండలంలో ఎంతోమంది తమ నివాసాలు, స్థలాలు కోల్పోయారు. నష్టపరిహారం అందించడంలో సమస్యలు తలెత్తడంతో కొంతమంది నివాసితులకు పూర్తిస్థాయిలో నష్ట పరిహారం అందలేదనే విమర్శలు ఉన్నాయి. తొలుత ముదినేపల్లి ప్రధానసెంటర్‌లో 11 నెలల క్రితం డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పనులు క్రమ పద్ధతిలో చేయకుండా ఇ ష్టానుసారంగా, ము క్కలు ముక్కలుగా నిర్మించి మధ్యలో వదిలేశాడు. దీంతో గ్రామంలోని మురుగుతో పాటు, వర్షపునీరు బయటకు పారేందుకు అవకాశం లేకపోవడంతో మురుగునీరంతా ప్రధాన రోడ్డుపైనే నిల్వ ఉంటుంది. మురుగునీరు రోజుల తరబడి జాతీయ రహదారిపై నిల్వ ఉండడంతో దుర్వాసనతో పాటు రహదారి ఆసాంతం గుంతలమయమై వాహన దారులు, ప్రజలు ప్రయాణించేందుకు ఏమా త్రం ఆనువుగా లేదు. గుంతల్లోకి మురుగునీరు చేరుకోవడంతో గుంత ఎంత లోతులో ఉందో తెలియక ద్విచక్రవాహనదారులు గుంతల్లో పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. రాత్రివేళల్లో భారీ వాహనాలు గుంతల్లో పడి భారీ శబ్దాలు వస్తున్నాయి. గత 11 నెలలుగా జాతీయ రహదారి గోతులమయమై ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారుల్లో ఏమాత్రం చలనంలేదు. డ్రెయినేజీ నిర్మాణ పనులు అసంపూర్తిగా చేయడంతో మురుగునీరు బయటకు పారుదల లేదు. దీంతో సెంటర్‌లోని హోటళ్లు, ఇతర వ్యాపారస్తులు వాడే నీరంతా రహదారిపైకి వచ్చి చేరుతోంది. నెలల తరబడి నీరు రోడ్డుపై, గుంతల్లో నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు, వ్యాపారులు దుర్గంధం భరించలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ మురుగంతా స్టేట్ బ్యాంకు, పోలీస్‌స్టేషన్, బస్టాండ్, పెట్రోల్‌బంకు ప్రాంతాల్లో నిల్వ ఉంటుంది. దీంతో బ్యాంకు, పోలీస్‌స్టేషన్, బస్టాండ్, పెట్రోల్ బంకులకు వెళ్లే ప్రజలు, వాహనదారలలు రోడ్డుపై ఏర్పడ్డ గుంతలతో, మురుగునీటి దుర్గంధంతో నరకం అనుభవిస్తున్నారు. నెలల తరబడి ఈ పరిస్థితి ఉండడంతో దుర్గంధం భరించలేక తాము రోగాల బారిన పడుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడ్డ గుంతలను పూడ్పించి, ప్రమాదాల బారిన పడకుండా వాహనదారులను, ప్రజలను రక్షించాలని, అలాగే అసంపూర్తిగా నిర్మించి మధ్యలో వదిలేసిన డ్రెయినేజీ పనులు వెంటనే కాంట్రాక్టర్ పూర్తి చేసేలా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని తక్షణమే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చేతుల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి – ముదినేపల్లి

అంటువ్యాధుల బారిన పడకుండా ప్రతిఒక్కరూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ అన్నారు. ముదినేపల్లి గ్రామ సచివాలయం వద్ద ఆదివారం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి కైకమ్మ మాట్లాడుతూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధుల బారిన పడకుండా ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై.శ్యాంసుందర్, గ్రామ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా ప్రపంచ చేతులు పరిశుభ్రత దినోత్సవ వేడుకలు ఆదివారం పలు గ్రామ పంచాయతీల్లో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా, పంచాయతీ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. మన ఆరోగ్యం మన చేతుల్లో అనే నినాదంతో ప్రజా భాగస్వామ్యంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ, డ్వాక్రా విఒఎలు, మహిళలు, ఆశాలు పాల్గొన్నారు.

ముసునూరు : ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే భోజనం చేసే ముందు, భోజనం తర్వాత చేతులను పరిశుభ్రం చేసుకోవాలని ఎంపిడిఒ జి.రాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా చేతల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో ఆయా పంచాయతీ సెక్రటరీ గ్రామస్తులకు అవగాహన కల్పించేటట్లు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, పరిపాలన అధికారి కూచిపూడి సాయిరాం, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సన్నీరాజన్, మువ్వ స్రవంతి, ఆరేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


జీలుగుమిల్లిలో..

అచ్యుతరామయ్యకు పలువురి అభినందన

ప్రజాశక్తి – జంగారెడ్డిగూడెం

వైసిపి నాయకులు, కార్యకర్తలందరూ వచ్చే ఎన్నికల్లో నూరుశాతం గెలుపు సాధించడానికి కృషి చేయాలని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులుగా నియమితులైన చిటికెల అచ్యుతారామయ్య అభినందన సభను ఆదివారం పిపిఎన్.చంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ ఎలిజా మాట్లాడుతూ సిఎం జగన్ అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలాగా కార్యకర్తలందరూ దృష్టి సారించాలన్నారు. అనంతరం పట్టణ నూతన అధ్యక్ష పదవికి ఎంపికైన చిటికెల అచ్యుతరామయ్యకు పూలమాల వేసి అభినందించారు. చిటికెన అచ్యుతారామయ్య మాట్లాడుతూ వైసిపి పట్టణ అధ్యక్ష పదవికి తనను ఎంపిక చేసినందుకు నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. 2024 సంవత్సరంలో జరిగే ఎన్నికల్లో వైసిపి నూరు శాతం విజయం సాధించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు మండవల్లి సోంబాబు, విద్యాసాగర్, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కంచర్ల వాసవిరత్నం, ముప్పిడి వీరాంజనేయులు, బూత్ కమిటీల జిల్లా కో–ఆర్డినేటర్ బివిఆర్.చౌదరి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీకి రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

ఏలూరు వైభవ్ జ్యూయలరీస్ అధినేత గ్రంధి అమరేంద్ర రెడ్‌క్రాస్ సొసైటీకి విరాళంగా రూ.50 వేల చెక్కును జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డికి ఆదివారం అందించారు. ఈ సందర్భంగా గ్రంధి అమరేంద్ర మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ చేసే సేవా కార్యక్రమాలకు తమ వంతుగా ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక వ్యాపారవేత్తలు ఎవరైనా రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్‌కి అవసరమైన పరికరాలను సిఎస్ఆర్ ఫండ్ కింద సమకూర్చాలని కోరారు. రెడ్‌క్రాస్ సొసైటీకి విరాళం అందించిన గ్రంధి అమరేంద్రకు, వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉషా బాలకృష్ణ, బడేటి చంటి, డాక్టర్ దొంతంశెట్టి బసవరాజు, రెడ్‌క్రాస్ ట్రెజరర్ రేవూరి శివప్రసాద్, బి.పద్మజావాణి, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు పాల్గొన్నారు.

నారాయణపురంలో ఇంటి స్థలాలు సిద్ధం

ప్రజాశక్తి – ఉంగుటూరు

నారాయణపురంలో జగనన్న ఇళ్ల స్థలాలను రెండు రోజుల్లో లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని వైసిపి మండల కన్వీనర్ మంగారావు ఆదివారం తెలిపారు. ఉంగుటూరులో 2.98 ఎకరాల్లో 109 మందికి స్థలాలు కేటాయించి మెరక చేశారు. వాటిలో లబ్ధిదారులకు ఎవరి స్థలం ఎక్కడో చూపిస్తామన్నారు. వెంటనే ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం నుంచి బిల్లులు వచ్చేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎంపిటిసి సభ్యులు అరవెళ్లి మహాలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షులు పైడి అరుణ్‌కుమార్, సచివాలయ కన్వీనర్ సీపాని బాలు, ఎంపిటిసి సభ్యులు బండారు నాగరాజు, రైతు భరోసా కేంద్రాల ఛైర్మన్లు మతుకుమిల్లి శ్రీధర్, బొబ్బిలి శ్రీను పాల్గొన్నారు.

కుంగ్ ఫూ ప్రతిభావంతులకు అవార్డులు

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఎ), యంగ్ మార్షల్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్, ప్రతిభా పత్రాలు బహుకరణ మహోత్సవం ఆదివారం ఏలూరు వైఎంహెచ్ఎ హాలులో నిర్వహించారు. యంగ్ మార్షల్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్, మాస్టర్ ఆర్.వేణుగోపాల్ శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్న విద్యార్థులు 30 మంది పాల్గొని వారు నేర్చుకున్న కుంగ్ ఫు విద్యలో ప్రావీణ్యతని ప్రదర్శించి బెల్టు, ప్రతిభ పత్రం పొందారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన హిందూ యువజన సంఘం కార్యనిర్వాహక కమిటీ ఉపాధ్యక్షులు బివి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్యకాంతారావు, సభ్యులు ఎం.సూర్యనారాయణ యాదవ్, గౌతమ్ బుద్ధ ప్రచార ట్రస్ట్ ఛైర్మన్ ఇస్సాకు చేతుల మీదుగా బెల్టు, ప్రతిభ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్స్ బి.సతీష్‌కుమార్, పి.సాయికుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

ఎస్‌సి, ఎస్‌టి ప్రజాసంఘాలు, ఎస్‌సి ఎస్‌టి ఉద్యోగ సంఘాలు కలిసికట్టుగా ప్రయాణం చేస్తూ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని నవ సమాజ సొసైటీ ఛైర్మన్ నేతల రమేష్‌బాబు పిలుపునిచ్చారు. అఖిలభారత తపాలా ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గానికి జాతీయ ఉపాధ్యక్షులుగా ఏలూరుకు చెందిన దాసరి నాగేంద్రకుమార్, జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా విశాఖపట్నానికి చెందిన అలమండ మంగరాజు, జాతీయ కార్యవర్గ సభ్యులుగా కాకినాడకు చెందిన వార వీర వెంకట సత్యనారాయణ, ఏలూరుకు చెందిన గుగులోతు ఝమ్లానాయక్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏలూరు నవ సమాజ్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం దళిత బహుజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నవ సమాజ్ సొసైటీ ఛైర్మన్ నేతల రమేష్ బాబు అధ్యక్షతన అభినందన కార్యక్రమం నిర్వహించారు. తొలుత బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దాసరి నాగేంద్రకుమార్, అలమండ మంగరాజు, వార వీర వెంకట సత్యనారాయణ, గుగులోతు ఝమ్లా నాయక్‌లను శాలువాలతో సత్కరించి మెమోంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్, పలు దళిత ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం జీవితం ఆదర్శం

ప్రజాశక్తి – టి.నరసాపురం

విద్యార్థులు అబ్దుల్‌కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని విజన్ ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో డాక్టర్ ఎపిజె అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్ మాట్లాడుతూ కలలు కనండి వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించండి అని చెప్పిన గొప్ప వ్యక్తి కలాం అన్నారు. భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రంలో చేరి అగ్ని, పృథ్వి, ఆకాష్, త్రిశూల్, నాగ్ వంటి రాకెట్ల రూపకల్పనలో ముఖ్యపాత్ర వహించారని తెలిపారు. కలాం దేశ రక్షణకు వెన్నెముకగా నిలిచి మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరు గడించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.


అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్

అధ్వానంగా రహదారి.. వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి – జంగారెడ్డిగూడెం

పట్టణంలోని బుట్టాయగూడెం వెళ్లే రోడ్డు గోతులయంగా తయారైంది. ఈ రోడ్డు నిర్మించిన నెలల వ్యవధిలోనే ధ్వంసమైందని, భారీ గోతులు ఏర్పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. భారీ గోతులతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్న క్రమంలో ఆటో యూనియన్, స్థానికులు స్వచ్ఛందంగా రోడ్డుపై గోతులను తాత్కాలికంగా పూడ్చడానికి ముందుకు వచ్చారు. ఈ క్రమంలో బుట్టాయగూడెం వెళ్లే సెంటర్ వద్ద ఇటీవల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మట్టితో గోతులు పూడ్చారు. మార్కెట్ యార్డు సమీపంలో ఏర్పడ్డ భారీ గోతుల్లో బండరాళ్లను వేసి పూడ్చారు. అయితే వర్షానికి మట్టి కొట్టుకుపోయి రాళ్లు ఉండటం వల్ల వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. పక్కా రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ ఎఇ సంధ్యారాణిని వివరణ కోరగా బుట్టాయగూడెం వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ.1.70 కోట్ల నిధులు కేటాయిస్తూ మున్సిపాలిటీలో తీర్మానం అయిందని తెలిపారు. ఈ మార్గంలో కొంతవరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.60 లక్షలు, మిగతా బిటి రోడ్డు నిర్మాణానికి రూ.1.10 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన అనంతరం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.


అధ్వానంగా ఉన్న రహదారి

చంద్రబాబు ఆరోగ్య బాధ్యత ప్రభుత్వనిదే : టిడిపి

వినూత్నంగా 'న్యాయానికి సంకెళ్లు' నిరసన

ప్రజాశక్తి – జంగారెడ్డిగూడెం

చంద్రబాబు అనారోగ్యానికి గురైతే ప్రభుత్వమే బాధ్యత వహించాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్రశేషు అన్నారు. నారా లోకేష్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న న్యాయానికి సంకెళ్లు నిరసన కార్యక్రమంలో భాగంగా స్థానిక టిడిపి నాయకులు గుమ్మడి హరికృష్ణ ప్రసాద్‌తో కలిసి నల్ల రిబ్బన్లు చేతులకు కట్టుకుని స్వగృహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్రశేషు మాట్లాడుతూ కేవలం రాజకీయ కక్షతో ఎలాంటి ఆధారాలు లేకుండా చంద్ర బాబు నాయుడును అన్యాయంగా అరెస్ట్ చేశారన్నారు. చంద్రబాబు ఆరోగ్యం ఏమైనా ఇబ్బంది తలెత్తితే జరిగే పరిస్థితులకు పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ముదినేపల్లి : చంద్రబాబు అరెస్టుపై నిరసనగా ఆదివారం మండలంలోని అల్లూరు గ్రామంలో న్యాయానికి సంకెళ్లు కార్యక్రమం తెలుగు యువత అధ్యక్షుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు చేతులకు నల్ల రిబ్బన్ కట్టుకుని, చేతులకు సంకెళ్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నీలిపల్లి సన్యాసిరావు, బోయిన ఫణికుమార్, ముంద్రు బాలరాజు, దాసరి శ్రీను, బర్ల రామ్మో హన్, నీలపాల మధు, వట్టిపల్లి సుకుమార్, నీలిపల్లి వెంకట్రావు, తోట రాజేంద్ర, శీలం సురేష్‌బాబు, కులమట్ల రాము పాల్గొన్నారు.

చింతలపూడి : టిడిపి నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి ఆధ్వర్యంలో న్యాయానికి సంకెళ్లు కార్యక్రమంలో భాగంగా చేతులకు సంకెళ్లు వేసుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి చింతలపూడి పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు, ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి తూము విజయ్ కుమార్, నియోజకవర్గ మహిళా నాయకురాలు యాళ్ల లీలా ప్రశాంతి, ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పల్లి శ్రీను, నియోజకవర్గ నాయకులు మారుమూడి థామస్ పాల్గొన్నారు.

చింతలపూడి : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో చంద్రబాబు సిఎం కావాలని, ఆయన సేవలు రాష్ట్రానికి ఎంతో అవసరమని టిడిపి చింతలపూడి నియోజకవర్గ యువ నాయకులు సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చంద్రబాబు అరెస్టుపై నిరసనగా బాబుకోసం మేము సైతం కార్యక్రమం లింగపాలెం మండలంలోని తువ్వచిలక రాయుడుపాలెం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు స్వచ్ఛందగా ముందుకు వచ్చి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబును విడుదల చేయకపోతే రానున్న రోజుల్లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకురాలు యాళ్ల లీలాప్రశాంతి, నియోజకవర ఎస్‌సి సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను, మండల తెలుగు రైతు అధ్యక్షులు మోరంపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

ముసునూరు : చంద్రబాబు అరెస్టుపై నిరసనగా మండలంలోని గుడిపాడు గ్రామంలో టిడిపి నాయకులు దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు మాట్లాడారు. ఈ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లి గంగారామ్, సుబ్బారావు, మండలపు ధర్మరాజు, మండలపు రాధాకృష్ణ, సుబ్రహ్మణ్యం, భాను, కృష్ణయ్య, శ్రీను, రాంబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భువనేశ్వరిని కలిసిన టిడిపి నేతలు

ద్వారకాతిరుమల : మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు రాజమండ్రిలో చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని, నందమూరి రామకృష్ణను కలిశారు. ద్వారకాతిరుమల చిన్నవెంకన్న ఆలయంలో పూజలు చేయించి భువనేశ్వరి, నందమూరి రామకృష్ణలను స్వామి వారి ప్రసాదాలు అందించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తూంపాటి పద్మవరప్రసాద్, షేక్ బాషా, పావులూరి మధుసూదనరావు, పొనుకుమాటి శ్రీ సంధ్య, కొత్తపల్లి సుబ్బారావు, వాసిరెడ్డి సునీల్, ఆచంట నాని, ఆచంట సుధీర్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో తణుకు :: పశ్చిమ గోదావరి జిల్లా

ఓ.యస్. 87/2020

వాది: సత్తి శ్రీనివాసరెడ్డి

ప్రతివాదులు: మేకా వెంకట రాజ్యలక్ష్మి వగైరా

1వ ప్రతివాది: మేకా వెంకట రాజ్యలక్ష్మి, భర్త: (లేటు) నాగేశ్వర్రావు, డోర్ నెం.12–67, బ్యాంకు కాలనీ, గేవియర్ నగర్, ఏలూరు.

వాది తరపు దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు దావాలో 1వ ప్రతివాదికి ఎన్ని పర్యాయములు దావా సమన్లు కట్టిననూ అమలు జరుగుటలేదు మరియు ఐ.ఎ.236/2020 పిటీషన్లోను నోటీసులు అమలు జరుగుటలేదు. అందువలన శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము ఈ పబ్లికేషన్ ప్రచురించిన తేదీ లగాయితూ 30 రోజులలో పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని అడ్వొకేట్ గారి ద్వారా గాని హాజరు కావలెను. అట్లు కాని ఎడల మీ పరోక్షములో ముందు గ్రంధము జరిపించ బడును. కనుక తెలియచేయడమైనది.

వాయిదా: 14-11-2023

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)

కె.యస్.యల్.యన్.ప్రసాద్,
న్యాయవాది, తణుకు–534 211
ప॥గో॥జిల్లా. సెల్: 98481 42794